రాగం: శుద్ధ ధన్యాసి

తాళం: ఆది

భావములోన బాహ్యమునందును
గోవింద గోవిందయని కొలువవో మనసా

1. హరియవతారములే అఖిల దేవతలు
హరిలోనివే బ్రహ్మాండంబులు
హరినామములే అన్ని మంత్రములు
హరిహరి హరిహరి హరియనవో మనసా

2. విష్ణుని మహిమలే విహిత కర్మములు
విష్ణుని పొగడెడి వేదంబులు
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని వెదకవో మనసా

3. అచ్యుతుడితడే ఆదియునంత్యము
అచ్యుతుడే అసురాంతకుడు
అచ్యుతుడు శ్రీవేంకటాద్రి మీదనిదె
అచ్యుత అచ్యుత శరణనవో మనసా